బ్రేక్‌ఫాస్ట్ స్కీం.. ఇక దేశమంతా

- జాతీయ స్థాయిలో మరో కేసీఆర్ పథకం
- అమలుకు కేంద్రం యోచన
- ఏటా 4 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా
- రాష్ట్రంలో 1-10 తరగతులకు విజయవంతంగా అమలు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): ప్రజాసంక్షేమం అమలులో దేశంలోనే ఖ్యాతి పొందిన కేసీఆర్ పథకాల్లో మరొక దాన్ని జాతీయ స్థాయిలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఇప్పటికే కొన్ని తెలంగాణ పథకాలను కేంద్రం ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తుండగా, తెలంగాణలో కొనసాగుతున్న సర్కారు బడుల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయాలని భావిస్తున్నది. తెలంగాణ తరహాలో దేశవ్యాప్త అమలు కోసం ఇప్పటికే ప్రణాళికలు రూపొందిస్తున్నది. పీఎం పోషణ్ స్కీంలో భాగంగా దీనిని అమలు చేయాలని కేంద్రం భావిస్తున్నది. ఇందుకు రూ.4 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దీని అమలుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. సర్కారు బడుల విద్యార్థుల ఆకలి తీర్చేందుకు, పోషకాహారాన్ని అందించేందుకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పేరిట కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఈ పథకం తెలంగాణలో నేటికీ కొనసాగుతున్నది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తున్నారు.

దాదాపు 23 లక్షల విద్యార్థులకు లబ్ధి

విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నిరుడు అక్టోబర్‌లో ప్రారంభించగా, ఇప్పటివరకూ నిరాటంకంగా అమలవుతున్నది. ఈ పథకాన్ని రాష్ట్రంలోని 27,147 బడుల్లో అమలు చేసేందుకు సంకల్పించగా, దాదాపు 23 లక్షల విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ప్రారంభంలో నియోజకవర్గానికి ఒక స్కూల్ చొప్పున 119 స్కూళ్లలో ఈ పథకాన్ని ప్రారంభించగా, ఆ తర్వాత మండలానికి ఒక స్కూల్ చొప్పున విస్తరించారు. క్రమంగా మండలానికి రెండు, మూడు చొప్పున విస్తరిస్తూ వచ్చారు. ఇప్పటివరకు 3,500కు పైగా బడుల్లో ఈ పథకం అమలవుతున్నది. రాష్ట్రంలోని విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ తోపాటు, మధ్యాహ్న భోజనం, రాగిజావను అందజేస్తున్నారు. తాజాగా తెలంగాణ తరహాలో కేంద్రం ఈ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసేందుకు ముందుకు రావడం విశేషం.

తెలంగాణ ఇల్లిల్లూ భగీరథ నీళ్లు!

- ప్రతి ఇంటికి శుద్ధిచేసిన నల్లా నీరు
- మరోసారి వెల్లడించిన కేంద్రం
- పైసా విదల్చని మోదీ సర్కారు
- అయినా 'మిషన్ భగీరథ' పూర్తి
- ఇదీ కేసీఆర్ సర్కారు ఘనత

100 శాతం కుటుంబాలకు శుద్ధిచేసిన తాగునీటిని నల్లా ద్వారా అందిస్తున్న రాష్ట్రాలు ఉన్నాయని తాజా నివేదికలో కేంద్రం ప్రకటించింది.

100 శాతం లక్ష్యం చేరిన రాష్ట్రాలు

రాష్ట్రం	ఇంటింటికీ నల్లా నీరు అందుతున్న కుటుంబాలు
తెలంగాణ	53,98,219
గుజరాత్	91,18,449
పంజాబ్	34,25,723
హర్యానా	30,41,314
హిమాచల్‌ప్రదేశ్	17,08,727
గోవా	2,63,013
పుదుచ్చేరి	1,14,969
డయ్యూడామన్-దాద్రానగర్ హవేలి	85,156
అండమాన్ నికోబార్	62,037

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): ఇంటింటికీ నల్లా నీటిని అందించటంలో తెలంగాణ ముందున్నదని కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రకటించింది. దేశంలో అతిఎక్కువ కుటుంబాలు ముందుగా ఇంటింటికీ నల్లా నీటిని అందించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. గత కొన్నేండ్లుగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తున్న కేంద్రం.. తాజాగా మరోసారి ఇంటింటికీ నల్లా నీటిని అందిస్తున్న రాష్ట్రాలు, కుటుంబాల సంఖ్యను శుక్రవారం మరోసారి వెల్లడించింది. దేశంలో మొత్తం 9 రాష్ట్రాలు ఇంటింటికీ నల్లా నీటిని అందించగా, వాటిలో 6 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లోని మొదట 100 శాతం కుటుంబాలకు తాగునీటిని అందించిన రాష్ట్రం తెలంగాణేనని తెలిపింది. రాష్ట్రంలో 54 లక్షల కుటుంబాలకు శుద్ధి చేసిన నీటిని అందించారు. 'మిషన్ భగీరథ' ద్వారా కేసీఆర్ ప్రభుత్వం శుద్ధిచేసిన గోదావరి, కృష్ణా నదీజలాలను అందించింది. నదీజలాలు ప్రజల ఆరోగ్యానికి అనువుగా ఉంటుందన్న నిపుణుల సూచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మిషన్ భగీరథను అతి తక్కువ వ్యవధిలోనే పూర్తిచేసి యావత్తు దేశం దృష్టిని కేసీఆర్ ప్రభుత్వం ఆకర్షించింది. దాదాపు 13 రాష్ట్రాలు ఈ పథకాన్ని ప్రశంసించాయి. ఇక్కడికి వచ్చి అధ్యయనం చేశాయి. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది. గత పదేండ్లుగా రాష్ట్రంలో ఒక్క ఫ్లోరైడ్ కేసు కూడా నమోదు కాలేదని కేంద్రమే పార్లమెంట్‌లో ప్రకటించింది. మిషన్ భగీరథకు కేంద్రం నయాపైసా సాయం చేయకపోయినా గత ప్రభుత్వం పథకాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా శుద్ధిచేసిన తాగునీరు అందుతున్నది. ఇంటింటికీ నల్లా నీటిని అందించటంలో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు వెనుకబడ్డాయి. మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్ తదితర రాష్ట్రాలు ఇంకా లక్ష్యాన్ని చేరుకోలేదు.

దాసోజు, కుర్రా పిటిషన్ల అర్హతపై 24న విచారణ

- హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 5, (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గ సిఫారసులకు అనుగుణంగా తమను ఎమ్మెల్సీగా నామినేట్ చేసేందుకు గవర్నర్ నిరాకరిస్తూ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సీజే అలోక్ అరాధే, జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఎమ్మెల్సీలను నామినేట్ చేసే అధికారం మంత్రివర్గానికి మాత్రమే ఉంటుందని, దీన్ని అడ్డుకునే హక్కు, అధికారం గవర్నర్‌కు లేదని ఉండదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. దీనిపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏజీ ఏ సుదర్శన్‌రెడ్డి సైతం అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పిటిషన్లకు విచారణ అర్హత ఉన్నదో లేదో తేలుస్తామని స్పష్టం చేసిన ధర్మాసనం.. విచారణను 24కు వాయిదా వేసింది.

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజేంద్రనగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు

దేశంలో ఉత్తమ ఠాణా.. రాజేంద్రనగర్

- అమిత్‌షా చేతుల మీదుగా అవార్డు
- సీఐకి సీఎం రేవంత్ శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబర్చిన పోలీస్ స్టేషన్‌గా రాజేంద్రనగర్ పీఎస్ నిలిచింది. శుక్రవారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన డీజీపీల సదస్సులో ఎస్‌హెచ్‌వో బీ నాగేంద్రబాబుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉత్తమ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు మొదటి స్థానం రావటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఇది తెలంగాణ పోలీసుల విజయం అని డీజీపీ రవిగుప్తా తెలిపారు. 17 వేలకుపైగా పోలీస్ స్టేషన్లను వెనక్కినెట్టి తెలంగాణ తొలిస్థానంలో నిలవటం మనకు గర్వకారణమని తెలిపారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ రకాల కేసుల దర్యాప్తు జరిగిన తీరు, స్టేషన్ నిర్వహణ, మహిళలపై కేసుల దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ వంటి పలు అంశాలను ఇదేస్ఫూర్తితో కొనసాగించాలని నాగేంద్రబాబుకు సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్లు రాజేంద్రనగర్ పీఎస్ పనితీరును ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అడిషనల్ డీజీ శిఖాగోయెల్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, నాటి డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి.. రాజేంద్రనగర్ పీఎస్ సిబ్బందిని అభినందించారు.

సాగర్ నుంచి ఏపీకి 5 టీఎంసీలు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ నుంచి 5 టీఎంసీల నీటిని ఏపీ వినియోగించుకునేందుకు కేఆర్‌ఎంబీ అంగీకరించింది. ఈ మేరకు ఏపీకి కేఆర్‌ఎంబీ శుక్రవారం లేఖ రాసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశంపై గత అక్టోబర్‌లో నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశం అప్పటికి అందుబాటులో ఉన్న జలాల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏ పీకి కేటాయించిన విషయం తెలిసిం దే. గత నెలలో నాగార్జునసాగర్ నుం చి 5 టీఎంసీలను ఇవ్వాలని ఏపీ కేఆర్‌ఎంబీకి ఇండెంట్ పెట్టడంతో తాజాగా ఆమోదం తెలిపింది.

అభిప్రాయం చెప్పండి

గోదావరి బేసిన్‌లో చేపట్టిన పలు ప్రాజెక్టులను బోర్డు సమావేశంలో చేర్చాలన్న ఏపీ ప్రతిపాదనలపై అభిప్రాయం చెప్పాలని తెలంగాణ సర్కారుకు జీఆర్‌ఎంబీ సూచించింది. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేకంగా లేఖ రాసింది. సమావేశంలో చర్చించాల్సిన అంశాలను ఇరు రాష్ట్రాలు జీఆర్‌ఎంబీకి ప్రతిపాదించాయి. గతంలో ప్రతిపాదించిన అంశాలతోపాటు అదనంగా మరికొన్ని అంశాలను బోర్డు సమావేశంలో చేర్చాలని ఏపీ ఇటీవలే బోర్డుకు లేఖ రాసింది.

స్వచ్ఛ అవార్డుల్లో తెలంగాణ హవా

- రాష్ట్రంలో 4 పట్టణాలకు జాతీయస్థాయి పురస్కారాలు
- జీహెచ్‌ఎంసీ, దక్షిణ భారత విభాగంలో సిద్దిపేట, గుండ్లపోచంపల్లి, నిజాంపేట మున్సిపాలిటీల సత్తా
- కేసీఆర్ సర్కారు కృషితోనే రాష్ట్రానికి అవార్డుల పంట

సిద్దిపేటలోని ఘన వ్యర్థాల అధ్యయన కేంద్రం

హైదరాబాద్/కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): 'స్వచ్ఛ' అవార్డుల్లో ఈ ఏడాది కూడా జాతీయస్థాయిలో తెలంగాణ హవా కొనసాగింది. నిరుడు నవంబర్ వరకు చేపట్టిన కార్యక్రమాలపై కేంద్ర ప్రభుత్వం తాజాగా అవార్డులను ప్రకటించగా, స్వచ్ఛ భారత్ పట్టణ విభాగంలో రాష్ట్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకొని ఘనతను చాటింది. సిద్దిపేట, గుండ్లపోచంపల్లి, నిజాంపేట పట్టణాలు దక్షిణ భారతదేశ విభాగంలో అవార్డులను దక్కించుకొన్నాయి. ఈ అవార్డులను ఈ నెల 11న ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో కేంద్రం అందించనున్నది. గత కేసీఆర్ సర్కారు మున్సిపాలిటీల్లో పారిశుధ్య, పచ్చదనం, తాగునీటి సరఫరా, ఇతర కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. కేంద్రం చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, చెత్త సేకరణ వాహనాలు, పారిశుధ్య కార్మికుల నియామకం, ఇంటింటా చెత్త సేకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, ఎఫ్‌ఎస్‌టీపీలు, వైకుంఠధామాలు, సమీకృత మార్కెట్ల నిర్మాణం, హరితహారం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టింది. ఈ కార్యక్రమాల ద్వారా జాతీయస్థాయిలో తెలంగాణ పట్టణాలకు అనేక అవార్డులు దక్కాయి.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిద్దిపేట టాప్.. హరీశ్‌రావు హర్షం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దక్షిణ భారతదేశ విభాగంలో సిద్దిపేట అగ్రస్థానంలో నిలువడంపై మాజీ మంత్రి, శాసన సభ్యుడు హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ట్వీట్ చేశారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణల్లో సిద్దిపేట చేపట్టిన వినూత్న విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. సిద్దిపేటకు మరోసారి అవార్డు రావడం గర్వకారణమని చెప్పారు. సహకారం అందించిన ప్రజలు, కృషి చేసిన కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

కరీంనగర్‌కు వాటర్ ప్లస్ హోదా

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రకటించిన వాటర్ ప్లస్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థకు స్థానం దక్కింది. దేశవ్యాప్తంగా 15 నగరాలకు మాత్రమే వాటర్ ప్లస్ స్థాయిని కేంద్రం కల్పించగా.. అందులో హైదరాబాద్‌తోపాటు కరీంనగర్ ఉన్నది. దేశంలో వాటర్ స్టేటస్ ఎనిమిది నగరాలకు మాత్రమే ఇవ్వగా, తెలంగాణలో ఒక్క కరీంనగర్‌కు మాత్రమే దక్కింది. నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల చేపట్టిన విస్తృత కార్యక్రమాలతో వాటర్ ప్లస్ హోదాకు కరీంనగర్ ఎంపికైంది.

భారత్‌తో బలమైన రక్షణ బంధం

- అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): భారత్-అమెరికా మధ్య బలమైన రక్షణ సంబంధాలు ఉన్నాయని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ పేర్కొన్నారు. భారత్‌కు ప్రధాన రక్షణ పరికరాల సరఫరాదారుగా అమెరికా ఎదుగుతున్నదని, అతిపెద్ద సైనిక భాగస్వామిగా అవతరించిందని చెప్పారు. హైదరాబాద్, కోల్‌కతాలోని అమెరికా కాన్సులేట్లు, అమెరికా రక్షణ శాఖ, సీయూటీఎస్ ఇంటర్నేషనల్ సంస్థ కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో 'డిఫెన్స్ న్యూస్ కాంక్లేవ్' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించాయి. జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ.. గత 15 ఏండ్లలో అమెరికా-భారత్ మధ్య రక్షణ రంగ ద్వైపాక్షిక వాణిజ్యం 25 బిలియన్ డాలర్ల మేరకు పెరిగినట్టు తెలిపారు. రక్షణ రంగంతోపాటు పలు ఇతర రంగాల్లో ఇరు దేశాలు సహకారాన్ని పెంపొందించుకుంటున్నాయని, ముఖ్యంగా ఏరోస్పేస్ రంగంలో భాగస్వామ్యాన్ని నెలకొల్పడం, సాంకేతికత బదిలీని సులభతరం చేయడం, స్వదేశీ రక్షణ ఉత్పత్తి సామర్థ్యాలను పెంపొందించడం లాంటి అంశాల్లో పురోగతి సాధించాయని చెప్పారు. బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ లాంటి కంపెనీలు టాటా కంపెనీతో కలిసి హైదరాబాద్‌లో అద్భుతమైన ఏరోస్పేస్ పరిశ్రమలను స్థాపించాయని గుర్తుచేస్తూ.. రక్షణ రంగంలో భారత్-అమెరికా భాగస్వామ్యం ప్రపంచ శాంతిభద్రతలకు మూలస్తంభంగా మారిందని పేర్కొన్నారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాల మెరుగుదల, ఇండో-పసిఫిక్‌లో వ్యూహాత్మక ప్రణాళికలపై ప్యానల్ చర్చలు నిర్వహించారు.

ఔషధాలు సూచించే ఏఐ

- వ్యాధుల చికిత్సలో నూతన వేదిక
- ఆవిష్కరించిన ఉప్పలూరి కేహెచ్ క్లినిక్



ఏఐ ఆధారిత జీన్‌కనెక్ట్ ఆర్‌ఎక్స్ ఆధునిక చికిత్స విధానాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు డాక్టర్ కల్యాణ్ ఉప్పలూరి, పద్మభూషణ్ డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రోగి జన్యు నిర్మాణం ఆధారంగా వైద్య చికిత్సను సిఫారసు చేసేలా వైద్యులకు ఉపకరించే ఓ వేదికను ఉప్పలూరి కేహెచ్ పర్సనలైజ్డ్ మెడిసిన్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూపొందించింది. వైద్యరంగంలో ఓ మైలురాయిగా నిలిచిపోయే కృత్రిమ మేధస్సుతో కూడిన వేదిక 'జీన్‌కనెక్ట్ ఆర్‌ఎక్స్'ను ఆవిష్కరించారు. ఇది కృత్రిమ మేధస్సుతో వ్యాధులను సమగ్రంగా అధ్యయనం చేసి సరైన ఔషధాలను సూచించే సరికొత్త పరిజ్ఞానమని డాక్టర్ కల్యాణ్ ఉప్పలూరి తెలిపారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ అయిన జీన్‌కనెక్ట్ ఆర్‌ఎక్స్‌ను ప్రముఖ వైద్యుల సమక్షంలో ఆవిష్కరించారు. కల్యాణ్ ఉప్పలూరి మాట్లాడుతూ వైద్య రంగంలోనూ కృత్రిమ మేధస్సును సమర్థంగా వినియోగించేందుకు అవకాశం ఉందని గుర్తించిన తమ సంస్థ ఏఐ ఆధారంగా పనిచేసే జీన్‌కనెక్ట్ ఆర్‌ఎక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. మెదడు క్యాన్సర్, మోనోజెనిక్ మధుమేహం, పార్కిన్సన్స్ వ్యాధి, అధిక కొలెస్ట్రాల్, ఆటిజం వంటి వ్యాధుల చికిత్సకు రోగి జన్యువులను బట్టి ఎలాంటి ఔషధాలను వాడాలో సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రముఖ దవాఖాన ఏఐజీతో కలిసి ఫార్మకోజెనోమిక్స్ అధ్యయనం చేపట్టామని, దాని ద్వారా జీన్‌కనెక్ట్ ఆర్‌ఎక్స్‌ను రూపొందించామని డాక్టర్ హిమ చల్లా తెలిపారు. కార్యక్రమంలో ఏఐజీ దవాఖాన చైర్మన్ అండ్ చీఫ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ పద్మభూషణ్ డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెన్మత్స వెంకటసుబ్బరాజు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో ఇన్నోవేషన్ ఫెయిర్

- 19న ఆన్‌లైన్‌లో ప్రారంభించనున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- పాల్గొననున్న దేశంలోని 23 ఐఐటీలు, ఎన్‌ఐటీలు
- ఐఐటీ పాలకవర్గ చైర్మన్ మోహన్‌రెడ్డి వెల్లడి

సంగారెడ్డి, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈనెల 19, 20వ తేదీల్లో ఇన్‌వెంటివ్-2024 పేరిట ఇన్నోవేషన్ ఫెయిర్ (మెగా ఆవిష్కరణల మేళా) నిర్వహించనున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 19వ తేదీన వెబ్‌నార్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రెండు రోజులపాటు ఐఐటీ హైదరాబాద్‌లో జరిగే ఇన్నోవేషన్ ఫెయిర్‌లో దేశంలోని 23 ఐఐటీలు, ఐఐఐటీలు, ఎన్‌ఐటీలు, బెంగళూరులోని ఐఐఎస్సీతోపాటు ఇతర ఇంజినీరింగ్ సంస్థలు పాల్గొననున్నాయి. 120 ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు. ఇన్‌వెంటివ్ 2024కు సంబంధించిన వివరాలను శుక్రవారం ఐఐటీ గవర్నింగ్ బాడీ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి, ఎన్‌ఐటీ వరంగల్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి, ఐఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ పీజే నారాయణన్ ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీలతోపాటు సాంకేతిక విద్యాసంస్థల్లో జరుగుతున్న పరిశోధనల వైపు దేశంలోని పారిశ్రామికవేత్తల దృష్టి మళ్లించడం, పరిశోధనలకు నిధులు సాధించడం లక్ష్యంగా ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఐఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ పీజే నారాయణన్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయంతో రోడ్డు ప్రమాదాలు నివారించేలా కొత్త ఆవిష్కరణలను రూపొందించినట్టు తెలిపారు. నాగ్‌పూర్‌లో వీటిని పరిశీలించగా మంచి ఫలితాలు వచ్చినట్టు చెప్పారు.

తుదిశ్వాస వరకు జైలే!

- గర్భిణి పింకీ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు
- జీవితాంతం జైల్లోనే ఉంచాలన్న న్యాయమూర్తి

నాంపల్లి కోర్టులు, జనవరి 5 (నమస్తే తెలంగాణ): గర్భిణి పింకీ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2018లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో నిందితులు మమత ఝా, వికాస్ కశ్యప్, అమర్‌కాంత్ ఝా, అనిల్ ఝాకు జీవిత ఖైదు విధిస్తున్నట్టు కూకట్‌పల్లిలోని 6వ మెట్రోపాలిటన్ సెషన్ జడ్జీ పావని ప్రకటించారు. తుదిశ్వాస విడిచే వరకు ఆ నలుగురినీ జైలులోనే ఉంచాలని శుక్రవారం వెలువరించిన తీర్పులో స్పష్టం చేశారు. సంచలనం సృష్టించిన ఈ కేసును పోలీసులు స్వల్ప వ్యవధిలోనే ఛేదించారు. సీసీటీవీ ఫుటేజీలు, ద్విచక్రవాహనం నంబర్ ఆధారంగా కేవలం 13 రోజుల్లోనే నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. వారు నివసించే గదిలో రక్తపుమరకలతో కూడిన ఎలక్ట్రిక్ కటింగ్ మెషీన్‌ను సీజ్ చేసి, డీఎన్‌ఏ రిపోర్టులు సేకరించారు. డీసీపీ ఎం గంగాధర్ నేతృత్వంలో దర్యాప్తు పూర్తి చేశారు. అనంతరం ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన కోర్టు.. గత ఆరేండ్లలో ఎంతో మంది సాక్షులను ప్రశ్నించింది. 65 మంది సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా నిందితులకు శిక్షను ఖరారు చేసింది.

హత్య ఎలా జరిగిందంటే..

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉపేందర్ కథనం ప్రకారం.. పింకీని వదిలించుకోవాలన్న ఆలోచనతో భర్త వికాస్ తరచూ ఆమెతో గొడవకు దిగేవాడు. ఓసారి ఆమెను బలవంతంగా రైలులో తీసుకెళ్లి నాగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో వదిలి వచ్చాడు. అనంతరం ఆమె మళ్లీ వికాస్ ఉండే చోటుకు తిరిగి రావడంతో గర్భం ఎలా వచ్చిందని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవలు జరగడంతో పింకీని కడతేర్చాలని వికాస్ నిశ్చయించుకున్నాడు. అందుకోసం తనతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న మమతతోపాటు అమర్‌కాంత్ ఝా, అనిల్ ఝా సాయం తీసుకున్నాడు. ఆ నలుగురు కలిసి పింకీని హత్యచేసి మృతదేహాన్ని తమ గదిలోనే దాచిపెట్టారు. ఆ తర్వాత కట్టెలను కోసే ఎలక్ట్రిక్ కటింగ్ మెషీన్‌తో పింకీ మృతదేహాన్ని ముక్కలుగా కోసి రెండు గోనె సంచుల్లో కట్టిన నిందితులు.. ఆ సంచులను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి గచ్చిబౌలి బొటానికల్ గార్డెన్ వద్ద పడేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

25న 'జమ్మికుంట'లో అవిశ్వాసం

- నోటీసులు జారీ చేసిన కలెక్టర్ పమేలా సత్పతి
- ఎక్స్ అఫీషియోగా ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారానికి చైర్మన్ ఏర్పాట్లు

జమ్మికుంట, జనవరి 5: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం బలనిరూపణకు ఈ నెల 25న అవిశ్వాసం తీర్మానానికి కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. చైర్మన్ రాజేశ్వర్‌రావుపై 23వ వార్డు కౌన్సిలర్ మల్లయ్య అవిశ్వాస తీర్మానానికి తెరతీసిన విషయం తెలిసిందే. కౌన్సిల్‌లో ఇరు వర్గాలకు చెరో 15 మంది సభ్యులు మాత్రమే ఉండటంతో పాలకవర్గం ఎన్నికకు ఎక్స్ అఫీషియో సభ్యుడి మద్దతు కీలకం అయింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇటీవల ఎక్స్ అఫీషియో సభ్యుడిగా తన పేరు నమోదు చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో మున్సిపల్ పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించేందుకు సిద్ధమయింది. చైర్మన్‌వర్గం హైదరాబాద్ క్యాంపు నుంచి జమ్మికుంటకు వచ్చింది. ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణ సీఐ రమేశ్, ఎస్సైలు శ్రీధర్, రాజేశ్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 5 గంటల పాటు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో కలెక్టర్.. కౌన్సిల్ సభ్యుడిగా ఎమ్మెల్యేకు ఆమోదం తెలిపినట్టు చైర్మన్ వర్గానికి సమాచారం వచ్చింది. దీంతో మున్సిపల్ సమావేశం రద్దయింది. చైర్మన్ వర్గం మళ్లీ హైదరాబాద్ క్యాంపునకు తరలివెళ్లింది. ఎక్స్ అఫీషియో సభ్యుడి మద్దతుతో చైర్మన్‌కు 16 మంది సభ్యులున్నారు. దీంతో.. ఈ నెల 25న జరుగనున్న బలనిరూపణలో వందశాతం తామే గెలుస్తామని, గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు.

ఏసీబీ పేరిట ఫోన్

- *50 వేలు సమర్పించుకున్న మున్సిపల్ అధికారి*
- *దుబ్బాకలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన*

దుబ్బాక, జనవరి 5 : ఏసీబీ అధికారుల పేరిట ఓ వ్యక్తి ఫోన్ చేసి బెదిరిస్తే మున్సిపల్ అధికారి 50 వేలు సమర్పించుకొన్నారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై గంగారాజు వివరాల ప్రకారం.. దుబ్బాక మున్సిపల్ ఏఈ యాదగిరికి ఐదు రోజుల క్రితం ఓ అపరిచితుడు ఫోన్ చేశాడు. 'మేం ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మీపైన పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. రైడ్ చేయకుండా ఉండాలంటే వెంటనే రూ.2 లక్షలు అకౌంట్‌కు పంపించాలి' అని ఆదేశించాడు. బెదిరిపోయిన యాదగిరి అకౌంట్‌కు ఫోన్‌పే ద్వారా రూ.50 వేలు పంపించారు. మిగిలిన రూ.1.50 లక్షలు వెంటనే పంపించాలని బెదిరింపు కాల్స్ వచ్చాయి. యాదగిరి 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్సై గంగరాజు తెలిపారు. ఈ ఘటనతో యాదగిరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతికి పాల్పడకపోతే అపరిచితుడికి రూ.50 వేలు ఎందుకు పంపించాల్సి వచ్చిందన్న ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

ఏసీబీకి చిక్కిన కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్

- 50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కిష్టయ్య

హనుమకొండ చౌరస్తా, జనవరి 5: లంచం తీసుకుంటూ కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏసీబీకి పట్టుబడ్డారు. పెండెం రాజేందర్ అనే కాంట్రాక్టర్ కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో పాలు, పెరుగు సరఫరా చేస్తుంటారు. మే, ఏప్రిల్ నెలలకు సంబంధించిన రూ.9 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండగా, వాటిని మంజూరు చేసేందుకు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్ సంగసారపు కిష్టయ్య లంచం డిమాండ్ చేశారు. శుక్రవారం కిష్టయ్య కాంట్రాక్టర్ రాజేందర్ నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కిష్టయ్య భార్య ఆర్ట్స్ కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వెంకట్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో కొక్కుల బాలకృష్ణ బదిలీ కావడంతో శుక్రవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, గ్రామస్థులు ఆయన్ను రూఫ్‌టాప్ కారులో ఊరేగించి పూలవర్షం కురిపించారు. ఆయన పదకొండు ఏండ్లపాటు ఇక్కడ సేవలందించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు పాఠశాల రెండుసార్లు ఎంపిక కావడం.. టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు టాపర్లుగా నిలువడంలో ఆయన ఎనలేని కృషిచేశారు.

– మల్లాపూర్

టీచర్ అరెస్ట్

పిల్లలతో అసభ్య ప్రవర్తన, తల్లిదండ్రుల ఫిర్యాదు

ఉట్నూర్, జనవరి 5: విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదుపై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఓ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్ సింగ్ గురువారం పాఠశాలలో చిన్న పిల్లలతో అసభ్యకరంగా ప్రవర్తించాడు.. శుక్రవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అతనిని పోలీసులు అరెస్టు చేశారు.